56

# మారిన కాలం - మారని మనిషి

"ఈపీడ రేపటితో వదిలిపోతుంది నాకు !" నెత్తిమీదున్న గడ్డిగంప యిసుకుగా నేలమీద బోర్లాపడేస్తూ అంది శేషమ్మ. వసారాలో మంచంమీద కూర్చునివున్న వెంకటాద్రికి శూలాల్లా తగిలాయా మాటలు.

"ఔనౌను ! లేపట్నుంచి గోళ్లుగిల్లుకుంటూ రాణీలా కూర్చోవచ్చు నువ్వు. నేనేమో ఎముకలు విరిగేలా వూరు వూరంతా చుట్టి రావచ్చు !" అన్నాడు భార్యకేసి మిర్రి చూస్తూ.

శేషమ్మ క్షణకాలం దిమ్మెరపోయింది. ఈ వేళప్పుడు భర్త అలా వసారాలో పనిలేకుండా కూర్చుని వుంటాడని ఆమె ఊహించలేదు. మాట్లాడకుండా కొడవలి చూరులో దోపి, గడ్డిగంప తేవటం మూలాన మాడుమీద గుంటలావున్న జుట్టు సరి చేసుకుంటూ గుడిసెలోకి వెళ్ళింది. "ఎట్లాగూ రేపటితో శని వదిలిపోతూనేవుందే; ఈ కాస్సేపులోపల నేనేదైనా అంటే తెగవుడుక్కుంటాడు. పోనీ కాస్సేపు నేనే నోరు మూసుకుంటే సరిపోయె !" అనుకుంటూ బుద్ధిదీపం వెలిగించే ప్రయత్నంలో పడింది.

వెంకటాద్రికి మాత్రం వెర్రికోపం ముంచుక వస్తోంది. శేషమ్మ కీరోజు పీడగా కన్పిస్తున్న ఆ గుఱ్ఱం—ఆ బండీ తనకు మహాలక్ష్మిలా తోస్తాయి ఎల్లవేళలా ! రేపటితో ఈ గుఱ్ఱం

బండి తను కళ్ళముందు నుంచీ, గుడిసె ముందు నుంచీ వెళ్ళి పోతాయి. పీడ వదలి పోతుందనీ, తనకి గడ్డికోసుకొచ్చే పని తగ్గిపోతుందనీ మురిసిపోతోందద్ది, కానీ మహాలక్ష్మి కదిలి పోతుం దనిపిస్తోం తనకు.

వెంకటాద్రి లేచి, గంపలో గడ్డి గుజ్జం ముందు వేశాడు. అది ఆశగా తింటోంది. మెల్లిగా వెన్నంతా నిమి రాడు. ఆ స్పర్శకు ఏళ్ళ తరబడి అలవాటు పడిపోయిన ప్రాణి ఓ విధమైన పరవశత్వంతో క్షణకాలం అలా నిలబడిమెల్లిగా తిరిగి గడ్డితినేస్తోందది.

“మీ అమ్మ నిన్ను కన్నప్పుడు దగ్గరున్నాం నేనూ మా అయ్యా! నీకు “ముత్యాలు” అని ముద్దుగా పేరెట్టింది నేనే! నీకు పచ్చగడ్డి పరకలు కొరకటం నేర్పింది నేనే! నీకు కళ్ళెం తగిలించి బండికి కట్టింది నేనే!—ఆనాటి నుంచి ఈ నాటి వరకూ నువ్వూ నేనూ —ఒక తల్లిపిల్లల్లా—(ఛ—ఛ ఒక్క తల్లి పిల్లలు మనుషులై తే ఎంతగా తన్నుకు చస్తారు? ఆ పోలిక పెట్టటం నాదే తప్పు!) స్నేహితుల్లా మెలిగాం. ఈ రోజు నిన్ను అమ్మెయ్యాలంటే నా కెంత బాధగా వుందో నీకు తెలుసా?”

గుజ్జం వెన్ను నిమురుతున్న వెంకటాద్రి చెయ్యి వణికింది— “తిను—తిను అది ముక్కుతూ, మూలుగుతూ, ఏడుస్తూ, తిడుతూ తెచ్చిన ఈ గడ్డి—ఆఖరుసారిగా తిను. ఆ తర్వాత రేపట్నుంచీ నీ ఖర్మ ఎలా వుందో? నాఖర్మ ఎలా వుంటుందో....?”

వెనక్కి వచ్చి వసారాలో మంచంమీద కూర్చున్నాడు వెంకటాద్రి. సంధ్య చీకట్లు బాగా ముసురుకున్నాయి. బుడ్డి దీపం తెచ్చి వాకిటి గూట్లో పెట్టి వెళ్ళింది శేషమ్మ. వెంకటాద్రి చుట్టూరా చీకటిలానే పరుచుకుంటున్నాయి ఆలోచనలు. అతగాడి కళ్ళముందు తన యవ్వనపు రోజులు సినిమా రీళులా తిరగడం మొదలెట్టాయి.

అప్పటికి నెల్లూరు ఇంతగా పెరగలేదు. నాలుగు సినిమాహాళ్ళూ, ఒక కాలేజి మాత్రమే వుండేవి. రైలు కట్టకు ఇవతలగానీ, అవతలగానీ, ఇన్ని ఇళ్ళు లేవు! అక్కడా అక్కడా ఒకొక్కటి అలా విసిరివేసినట్లుండేవి. ఇన్ని బస్సుల్లేవు! కోవూరుకూ, అల్లూరుకూ, బుచ్చిరెడ్డిపాళేనికీ, పడుగుపాడుకూ, రాజుపాలేనికీ మధ్య జోరుగా పరుగెత్తుతుండేవి గుర్రపు బండ్లు! ఎవరో ఒకరో అరా కారున్న మహారాజులు మినహా, స్వంత గుర్రపు బండ్లమీద వెళ్ళేవారు చాలా మంది!

వెంకటాద్రికి పిల్లనిస్తానంటూ వచ్చిన రామయ్య వెంకటాద్రి వాకిట్లోవున్న బండిని, వసారాలో ఓమూలగా కట్టేసివున్న బలిష్టమైన గుర్రాన్ని చూచి తెగ ముచ్చటపడి పోయాడు. కాబోయే అల్లుడి కంటే....ఆ "ఆస్తి" చాలా గొప్పగా కనిపించిందతగాడికి. పిల్ల సుఖపడడానికి ఇంతకంటే ఏం కావాలి అనుకున్నాడు. "రాజా" లాటి గుఱ్ఱం, బండీ మహారాజాలా సంపాదించుకోవచ్చని శేషమ్మకూడా సంతోషించింది. తన భర్త "కలిగిన" వాడేనని సంబరపడింది.

దానికితోడు ఓబిడ్డ తల్లి అయ్యేవరకూ వెంకటాద్రి శేషమ్మ కాలు కింద పెట్టనివ్వలేదు. సినిమాకు పోవాలన్నా గుర్రపు బండిలోనే. రంగనాయకుల కోవెలకు వెళ్ళాలన్నా గుర్రపు బండిలోనే. నెల్లూరంతా తిప్పి చూపించాలన్నా బండే! సంత జరిగినా, తిరణాల జరిగినా తేరుమీద వూరేగే దేవుడిలా వూరేగించేవాడు.

"బాడుగ పోతోంది మాఁవా! ప్రతి చోటికీ బండెం దుకూ!" అనేది శేషమ్మ గునుస్తూ!

"నీ కంటె ఎక్కువేటి బాడుగ. కాకున్నా సొంతబండీ, సొంత గుఱ్ఱం. మనిష్ట మొచ్చినప్పుడు మనిష్ట ప్రకారం తిర గొచ్చు! రెండు ట్రిప్పులు కోవూరుకో పడుగుపాడుకో, రాజుపాలేనికో, బుచ్చికో ఏసుకున్నానంటే నాలుగు రోజులు మనిద్దరం జలసాగా బండిమీద వూరేగొచ్చు....ఏమంటావ్?" అనేవాడు వెంకటాద్రి గర్వంగా! అసలా వీథిలో చాలా మంది ఆడవాళ్ళు ముఖ్యంగా కొత్తకోడళ్ళు శేషమ్మ వైభ వం చూచి ఈర్ష్యపడే వాళ్ళు.

"అదృష్టమంటే దానిది! చక్కగా ఎక్కడికి వెళ్ళా లన్నా బండి మహారాణీలా!" అనుకొనేవారు. శేషమ్మ వినేలాకూడా అనేవారు! ఆ మాటెంతో గర్వంగా మొగు డితో చెప్పుకొనేది శేషమ్మ!

"మన ముత్యాలు చల్లగా ఉండాలేగాని మన కేమిటి లోటు?" అనేవాడు వెంకటాద్రి గర్వంగా. ఆ హుషారు కొద్దీ శేషమ్మ, వెంకటాద్రి అటు బండి కట్టుకెళ్ళగానే....ఇటు

గడ్డికి పోయేది! ఎటు చూచి నాకావలసినంత బీడు....పచ్చని గడ్డి.... అక్కడక్కడా చిన్న చిన్న మడుగుల్లో గుర్రాలకు నెత్తి మీద పెట్టేందుకు తమాషాగా ఉండే రంగురంగుల పూలు! రెండు గంటలలో నాలుగు గంపల గడ్డి దోక్కొని నాలుగు పూలు లాక్కొని ఇంటికి రావటం శేషమ్మకు అలవాటైపోయింది. గుర్రంతినగా మిగిలిన గడ్డి బండిలో మెత్తగా పరచి, ఇంకా మిగిలితే గోనెపట్టలో వేసి, బండిక్రింద వుయ్యాలలా వ్రేలాడదీసి...."పద ముత్యాలూ" అంటూ గుఱ్ఱాన్ని బండికి కట్టి...."నీ హస్త వాసి శేషూ! ముత్యాలు రోజుకో వన్నెతో పంచకల్యాణిలా తయారవుతోంది!" అంటూ భార్యకేసి కన్నుగీటి, బండిలో బోర్లాపడుకుని చెఱకోల కొయ్య శబ్దం చెయ్యగానే....పంచకల్యాణిలానే పరుగు తీస్తుంది ముత్యాలు....

బండికి ముత్యాలును అలవాటు చేసే కొత్తలో బాగా కూర్చునేవాడు వెంకటాద్రి. "నేవుట్టినప్పట్నుంచీ చూస్తున్నారా ముత్యాలూ! ఈ నెల్లూరు రోడ్లు ఇట్లాగేవున్నాయి! ఎక్కడ గుంటో, ఎక్కడ మిట్టో....నాకే....నాకేమిటి ? ఈ రోడ్లేసిన కాంట్రాక్టర్లకి....ఆ భగవంతుడికీ కూడా తెలీవు! వర్ష మొస్తే చాలు....ఇక రోడ్లే నదులు....అదుగో ఆ అండర్ బ్రిడ్జివుంది చూశావూ....అదో సముద్రమైపోతుంది! ఎక్కడి బండ్లక్కడ "అల్టు" ఐపోవలసిందే! కళ్ళుమూసుకొని దూకేవు ....అన్యాయంగా ఇద్దరం ఛస్తాం!.... నే చెప్పినట్టిను....అసలే ఈరోడ్లు ఇరుకు. దానికి తోడు రెండువేపులా మురికాలువలు. మురికాలవల మీదికి ఇళ్ళు....జాగ్రత్తగా పరు

గెత్తు!'' అంటూ గుర్రానికి అస్తమానం హెచ్చరికలు చేసే
వాడు. తెలిసినవాళ్ళెవరైనా "అదేమిట్రా వెంకటాద్రీ!
దానితో కబుర్లు చెబుతావ్! అదేం మనిషా? నీకు మతి
పోయిందా?'' అంటూ ఎగతాళి చేసేవాళ్లుకూడాను.

అలాటప్పుడు వెంకటాద్రి నవ్వేస్తాడు, "అది గుఱ్ఱంగా
పుట్టిందిగానీ, మనిషికంటే మాబాగా మాట వింటుంది!''

....నిజమే! ఓ రోజు .... నెల్లూరునుంచి బుచ్చివరకూ
బేరం కుదుర్చుకున్నారు ఓ భార్యా, భర్త, భార్యతల్లీనూ.
తల్లీకూతుళ్ళు ఏనుగుల్లా ఉన్నారు....ఆ అల్లుడు బొత్తుగా
పీనుగులా వున్నాడు! బండిలో వాళ్ళు కూర్చున్నాక....కర్ణుడి
రథంలా భూమిలోకి బండీ గుఱ్ఱము దిగిపోతున్నా యనిపిం
చింది వెంకటాద్రికి...."బరువెక్కువైంది!'' అంటూ గోణు
క్కుంటుంటే .... ఎక్కుడూ'' దిగుడూ వచ్చిన చోటల్లా
తుండ్లలా వున్న తల్లీకూతుళ్లు అలాగే కూర్చుని, చీపురుపుల్ల
లాటి అల్లుణ్ని మాత్రం దింపేశారు....బండి విరుగుతుందని.
అలాటి ఎందరినో అవలీలగా లాక్కువెళ్ళటం అలవాటయి
పోయింది ముత్యాలుకు. రోడ్లకు ఎక్కడ గతుకులు వున్నాయో
వర్షాకాలమైనా కనిపెట్టే మెలకువ వచ్చేసింది! ఎందరో పెళ్ళి
వారు, మరెందరో కొత్త దంపతులు, ఎందరో రోగులు....
ఎంతెంత దూరమో ప్రయాణించేవారు....ఓ అమ్మాయి....
బాగా కలిగినింటి ఆడపడుచు....బండెడు నగలతో బండిలో
కూర్చుంది. ట్రంకు రోడ్డు దాటేసరికి ఓ కుర్రాడు వచ్చి కలి
శాడు....స్టేషన్‌కు తీసుకెళ్ళమని చెప్పాడు ....త్రోవ పొడు
గునా ఇద్దరూ మదరాసుకు వెళ్ళిపోవాలనీ....పెళ్లాడాలనీ....

ఏదేదో మాట్లాడుకుంటున్నారు.... వెంకటాద్రికి అర్థమై పోయింది అసలు సంగతి. ఆ అమ్మాయి తండ్రి పేరుకూడా తెలిసిపోయింది వాళ్లిద్దరి మాటలలో....స్టేషనులో ఇద్దరూ దిగగానే.... వెంకటాద్రి వాళ్ల వెనకాలే వెళ్లాడు....మద్రాసుకు వెళ్ళే బండి ఓ గంట లేటుందని తెలిసింది. గబగబా స్టేషను మాష్టరు దగ్గర కెళ్ళి రహస్యంగా అసలు సంగతి చెప్పి, ఎలాగైనా తను తిరిగి వచ్చేవరకూ వాళ్లని ఓ కంట కనిపెట్టమని చెప్పి బండిలో వచ్చిపడ్డాడు!...."ముత్యాలూ పదరా అవతల కొంప మునిగిపోతోంది! అయినింటి ఆడపిల్ల—కళ్లకు గంతలుకట్టని గుర్రప్పిల్లలా ఎగిరిపడుతోంది. ఏది గుంటో, ఏది మిట్టో తెలియనంత దూకుడుగా దూసుకుపోతోంది. ఆ కుర్రవెధవ....పోకిరీ వెధవ....ఆ పిల్ల నగలు కాజేస్తాడు.... నాశనం చేస్తాడు....మనిద్దరం వుండగా ....అలాంటి ఘోరం జరగనివ్వకూడదు....పదపద...." అతగాడి బాష, బాధ! ముత్యాలుకు అర్థమైందిలా వుంది....గాలిలో తేలిపోతున్నట్టు పరుగెత్తింది....ఆ అమ్మాయి తండ్రి.... కబురు తెలిసి అదిరి పోయాడు....ఇంటిల్లిపాదీ గాభరా పడిపోయారు....కారున్న సంగతే మరచిపోయి....బండిలోకి దూకాడు ఆ తండ్రి కంగారులో....బండి ఫర్లాంగు సాగాక...."అరె కారులో పోవలసింది! ట్రెయిన్ వస్తోందో ఏమిటో!" అంటూ బాధపడ్డాడు. "గాభరా పడకండి బాబూ! కారు కంటే తొందరగా తీసుకుపోతుంది మా ముత్యాలు. స్టేషను మాష్టరుకి చెప్పొచ్చానుగా!" అంటూనే స్టేషన్ కు....నిజంగా కారంత వేగంగానే చేరుకుంది బండి! పిల్ల తండ్రిని చూచి కుర్రవాడు జారు

కున్నాడు....అమ్మాయి కుక్కిన పేనులా వచ్చేసింది తండ్రి వెంట !....ఆ తర్వాత ఓ సంవత్సరం జరిగాక కాబోలు....ఓ సారి వాళ్ల కారు చెడిపోతే....ఆ అమ్మాయి,ఆమె భర్త వెంకటాద్రి బండిలో సినిమాకు వెళుతూ సరసాలాడు కుంటుంటే వెంకటాద్రి నవ్వుకున్నాడు...."విన్నావా ముత్యాలూ ! ఈ పిల్లే—ఆ వెధ వెవడితోనో లేచిపోయి....ఇంచక్కటి బ్రతుకునీ బుగ్గిపాలు చేసుకుం దారోజు ! ఇవాళ చూడు....నన్నూ నిన్నూ గుర్తుబట్టలేదు ! పోనీలే ఓ మంచిపని చేశాంకదూ ?" వెంకటాద్రి మూగభాష ముత్యాలుకు అర్థమైనట్లు....చిన్నగా సకిలించింది....

పదేళ్ళు గిర్రున తిరిగాయి....

సినిమాహాళ్ళు పన్నెండు అయినాయి ! ఇంటిమీద ఇల్లుగా ఇళ్ళు వెలిసిపోయాయి ! రోడ్లపక్క నున్న మురుగు కాలువలు మరింత మందంగా....మరింత కంపుకొడుతూ ప్రవహిస్తున్నాయి....రోడ్లు మరికాస్త ఇరుకుగా, ఇంకా ఎగుడుదిగుడులుగా....తయారయ్యాయి....ఆడపిల్లల కాలేజి వెలిసింది. వీధికి పది ఆస్పత్రులూ, పదిహేనుమంది డాక్టర్లూ, మొలుచుకు వచ్చారు. హోటళ్ళూ, లాడ్జీలు. బ్రోతల్ హౌస్‌లూ....

సైకిల్ రిక్షాలు వచ్చేశాయి ! బస్సులూ టౌన్ బస్సులూ వచ్చేశాయి !

శేషమ్మ ఐదుగురు పిల్లల తల్లయింది ! ఇంతక్రితంలా పచ్చిక బయళ్ళు లేవు....అక్కడంతా ఇళ్ళూ, ఆఫీసులూ....

కొత్త కొత్త "నగర్"లూ వెలసిపోయాయి ! గుర్రపుప్వాలు కూడా ఆట్టేలేవు ! రెండు గంటలు డోకుడుపారతో, కొడవలి లిక్కితో నేల చెక్కినా గంపతో గంపెడు గడ్డి పోగ వటంలేదు. పచ్చిగడ్డి చిన్నమూట రూపాయినుంచి రూపాయి న్నర ధర పలుకుతోంది ! తిండి గింజలే దొరక్కుంటే, ఇక గుర్రానికి వులవలెలా వస్తాయి రోజూ!

వెంకటాద్రిని ఇవేమీ కదిలించలేదు.

"వూరికే బాధపడకే శేషూ! రోజులన్నీ ఇట్లాగేవుండ వులే! మంచి బాడుగలే వస్తాయిలే! గుర్రానికీ, మనకూ కావలసినంత దాణా దొరుకుతుందిలే!" అన్నాడు అనంతమైన విశ్వాసంతో !

కానీ.... వెంకటాద్రికి ఆత్మవిశ్వాసం ఒక్కటే అన్నం పెట్టడంలేదు ! రిక్షాల జోరు హెచ్చింది....

"ముప్పావలా ఇస్తాను—వస్తే రా! రాకుంటే వెళ్ళు.... ముప్పావలా పారేస్తే....మూడు మైళ్ళు వెళ్ళొచ్చు రిక్షాలో!" అంటూ....తను ఆలోచించి ఏసంగతీ చెప్పేలోగానే,రిక్షాలో కూర్చుని వెళ్ళిపోతున్నారు జనం.

"బాబూ! రిక్షాలో కూర్చోండి! ఎట్లాంటి చుక్క కావాలంటే అట్లాంటి చుక్క కాడికి తీసుకుపోతా! ఏ లాడ్జికి కావాలంటే ఆ లాడ్జికి తీసుకపోతా!" అంటూ గుసగుసలుగా చెప్పి, గాలం వేస్తున్నారు కొందరు రిక్షావాళ్ళు ! ఏకంగా కన్నెపిల్లల్నీ, పడుచు కుర్రాళ్లనీ రిక్షాలలో కూర్చోపెట్టుక తెర అడ్డంవేసి....ఏ ఏకాంత ప్రదేశాలకో తరలిస్తుండటం పరిపాటయి పోయింది !

"బండి కడతావా అబ్బీ !" అన్నారో పడుచు జంట....

"కడతాను బాబూ ! ఎక్కడికి కెళ్ళాలి ?" అన్నాడు వెంకటాద్రి.

కుర్రాడు కొంటెగా ఆ అమ్మాయి కేసి చూసి కన్ను గొట్టాడు. అమ్మాయి....అంగీకార సూచకంగా చిరునవ్వు నవ్వి వూరుకుంది ! ఆ అమ్మాయి కాలేజీలో చదువుతున్న పిల్ల! పెళ్ళిగానిపిల్ల....! వెంకటాద్రి గుండె క్షణకాలం గుబ గుబ లాడింది. "దర్గామిట్టదాటి...." ఆ కుర్రా డేదో చెప్ప బోయాడు ....

"నాకు వేరే బేరముందిలే బాబూ! ఇట్లాంటి పనులకు నే రాను!" అనేశాడు వెంకటాద్రి రోషంగా.

ఆ కుర్రాడు క్షణకాలం ముఖం గంటు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయీ ముఖం చిట్లించుకుంది.

"ఆ ఏడుపేదో ముందే ఏడవలేకపోయావ్ ? ఓ పావలా ఎక్కువ పారెయ్యమంటే పారెయ్యనూ ?" అన్నాడు కుర్రాడు ధుమధుమ లాడుతూ !

"పావలాకాదు....పదిరూపాయలు పారేసినారాను.... ఇట్లాంటి యవ్వారాలకు కాదు నాబండి-గుర్రం....నేనూ!" తెగేసి చెప్పాడు వెంకటాద్రి.

"అతగాడితో మన కేమిటి....ఓ రిక్షాచూడు వెడ దాం !" అని కాబోలు ఇంగ్లీషులో అంటోందా పిల్ల.

"తెగబడ్డ ఆడపిల్ల! బాఫ్ రే! కాలం! చూడరా ముత్యాలూ!" అన్నాడు వెంకటాద్రి.

చూస్తుండగానే ఆ ఇద్దరూ ఓ రిక్షాలో కూర్చుని తెర అడ్డువేసుకొని తుర్రున ఎగిరిపోయారు.

"ఇది మరీ బావుంది! మన కెందుకు ఎవరెట్లాంటి వాళ్ళయితే? ఎంతకో అంతకు బాడుగకు పోవాలి గానీ, ఇట్లాంటి నియమాలు మనకు కూడదు పెడతారా?" అంటూ తిట్టిపోసింది శేషమ్మ ఆ సంగతి చెబితే, మెచ్చుకుంటుందని ఆశించిన వెంకటాద్రిని.

అసలీ మధ్య శేషమ్మకూడా మారిపోయింది! ఒకప్పుడు గర్వకారణంగా వున్న గుర్రమూ, బండి గుదిబండల్లా వున్నాయి ఆమెకు! తమ వీధిలో ముప్పాతికమంది మగవాళ్ళు ....తలకో రిక్షా బాడుగకు తెచ్చుకున్నారు.

అప్పుడప్పుడు కొందరు మగవాళ్ళు: సరదాగా, తమ పెళ్ళాల్ని రిక్షాల్లో సినిమాకీ షికారుకీ తీసుకుపోతున్నారు కూడాను! రోజుకు మూడు నాలుగు రూపాయలు సంపాదించుకొస్తున్నారట బాడుగపోను! ఇదెంత హాయిగావుంది! ఆ సైకిలుకు పచ్చిగడ్డి పనిలేదు....కుడితినీళ్ళక్కరలేదు, వులవలు అవసరం లేదు. ఎప్పుడైనా కాస్తంత ఆయిలూ, గాలీచాలు! చెయినో ఏదో చెడితే వేసుకోవటం! శేషమ్మ ఆలోచనలు సరికొత్త దారిలో పడ్డాయి!

ఈ వెధవ గుర్రాన్నీ బండినీ అమ్మి పారేసి, తామూ ఓ రిక్షా తీసుకుంటే తనకీ గడ్డి తెచ్చే కష్టం తప్పుతుంది....

తన మొగుడు సరివారిలో గొప్పగా రిక్షా తొక్కుతాడు. తన పిల్లలకూ తిన్నంత తిండి ! పై పెచ్చు తను సొంత రిక్షా దారుడి భార్యా !

మొన్నను ఆ సుబ్బులు మొగుడు....ఎవరో ఓమారా జుని....ఓ అమ్మాయినీ....అట్లానాలుగు ఫర్లాంగులు తీసికెళ్ళి వదిలేసివస్తే పదిరూపాయలు ఈనామిచ్చాడట మహాను భావుడు. అసలు రాత్రిళ్ళు "ఖాతా"లలోనే ఎక్కువ ముట్టు తుండట సుబ్బులు మొగుడికి ! ఈ మధ్య దానికో బంగారు గొలుసుకూడా చేయించాడు వాడు.

తన మావ పిచ్చిగానీ తనొక్కడూ మడికట్టుకూర్చుంటే కాలం ఆగుతుందా ? అందరూ "అట్లాంటి" బాడుగల్లో కావలసినంత సంపాదించుకుంటున్నారు. ఇంకా ఈ కూటికి గుడ్డకు తడుముకొనే బ్రతుకెందుకు ? రిక్షా కొని తీరాల్సిందే ? ఈ పాడుబండీని, గుర్రాన్ని అమ్మి పారేయాల్సిందే !

శేషమ్మ ఆలోచనలు, ఆమె తలలో ఆగక వాగ్రూపంతో బయట పడటానికి ఎక్కువ రోజులు పట్టలేదు.... వెంకటాద్రికి బయట ఎంత చికాకుగా వుందో, ఇంట్లోనూ అంతటి అశాంతి తయారయింది....ముత్యాలు రోజురోజుకూ నీరసించిపోతోంది ! బాడుగ ల్లేవు ! సరైన పోషణ లేదు. ఇంట్లో శేషమ్మ ఆదరణ అసలే లేదు. పిల్లల దగ్గర్నుంచి 'రిక్షా, రిక్షా' అన్న పాటే. బండి మోటుగా బండలా కనిపిస్తోంది, అందరికీ.

"అది కాదే శేషూ ! మీ ఆయన కేం తిక్కా? అందరూ రిక్షామీద అంతలేసి సంపాదిస్తూంటే, ఈ బండి మెడ

కట్టుకూర్చున్నాడు" అంటూ వదినెలూ, అన్నలూ, ఇరుగు పొరుగులూ, చివరకు తండ్రికూడా ఎగతాళి చెయ్యటంతో.... శేషమ్మకు తిక్క రేగిపోయింది!

పదిరోజుల క్రితం తెగేసి చెప్పింది.

"నాకు నగలూ నాణ్యాలూ చేయించుకుంటేమానె, నాకూ పిల్లలకూ ఇంత కూడయిన పెట్టకుంటే ఏదో చూచుకోవాలి మేము? ఇక గుర్రప్పేనుగే వుండాలో, నేనే వుండాలో తేల్చుకో! తలా కాస్త "ఎండ్రిన్" పోసి నేనూ పోసుకుంటా" అనేసింది.

వెంకటాద్రికి ఊపిరి సలప లేదు.

అతగాడి ప్రాణం ఆసరాగా తీసుకుని శేషమ్మ, ఓ "దలారి"ని పట్టుకుని బేరంకూడా కుదిర్చేసింది బండికీ, గుర్రానికీ. అంతేకాదు ఓ కొత్త రిక్షా కొనిపెట్టమనికూడా చెప్పేసింది. అతగాడు రిక్షా ఖరీదు కుదుర్చుకొని వచ్చాడు కూడా!

* * *

"అన్నానికి రా!"

దగ్గర్లో వినిపించిన శేషమ్మ గొంతుకతో త్రుళ్ళిపడి కూచున్నాడు వెంకటాద్రి.

గతమంతా చెదిరిపోయింది. శేషమ్మ భూతకిలా ఎదుట నిల్చుని వుంది!

"పద వస్తున్నా"

తెల్లవారూ నిద్రపట్టలేదు వెంకటాద్రికి....

తెల్లగా తెల్లారింది. బండినీ గుఱ్ఱాన్నీ కొన్న మనిషి ఎవరో మోతుబరి రైతుకు పాలేరు.... వచ్చి కూర్చున్నాడు తోలుకు పోవటానికి....

వాకిట్లో కొత్తరిక్షా వచ్చి నిలిచింది. మధ్యవర్తి పోలయ్యకూడా నిల్చుని వున్నాడు.

"ఉండు పోలన్నా! శకునవేళ వచ్చావు. ఆ బండీ గుఱ్ఱం అట్టాదాటనీ, ఆడబ్బు నీ చేతిలో ఇట్లా వేస్తాను.... ఇంట్లో అట్టే పెట్టామంటే అది కాస్తా ఖర్చైపోతుంది!" అంటోంది శేషమ్మ సంతోషంగా....

వెంకటాద్రి పులకలేదు పలకలేదు.

బండికి గుఱ్ఱాన్ని కట్టిచ్చాడు. చెలకోల ఆ పాలేరు చేతికిచ్చాడు....ఒక్కసారి గుఱ్ఱాన్ని అప్యాయంగా నిమిరాడు.

"వెళ్లు ముత్యాలూ! వెళ్లు! మనిద్దరి నీతీ, వేగమూ ఇప్పుడెవరికీ అక్కర్లేదు. నా దగ్గరున్నా ఇక నీకు దిక్కులేని చావే! రిక్షామోజులో వున్న శేషు ఇక నిన్ను వుట్టినే చంపుతుంది....

అదుగో అక్కడుంది చూడూ ఆరిక్షా! దాని కొత్త చక్రాలూ, ఇనుప కమ్మిలూ ఎంత తళతళ మెరుస్తున్నాయో! ఆ మెరుపు నాలుగురోజులే! ఆ తర్వాత అవి తుప్పుపడతాయి! అయినా ఆ తుప్పు పట్టిన చక్రాలే....

ఎంత చక్రమో తిప్పుతున్నాయి!

నేనూ అది తొక్కటం నేర్చుకోవాలి. ఆ తెరలు దించాలి. టౌన్‌కు దూరంగా, చాటుమాటుగా, ఆపుకోవాలి.... గొందుల్లో, సందుల్లో దూరాలి.... నీతినీ, అవినీతినీ కలగాపులగంగా కలిపి తొక్కాలి. ఒద్దొద్దు నువ్వు ఇలాటివి చూడలేవు-నీకు అలవాటు లేదు. మేం మనుషులం-అలాటిది మాకు స్వతహాగాకున్నా, కాలం నేర్పుతుంది. వెళ్ళు వెళ్ళు! ఆరైతేవరో బాగా చూచుకుంటే, హాయిగా బ్రతుకుతావు. నిన్ను ఏ సేద్యగాళ్ళకో వప్పజెప్పి స్వారికి మాత్రం తయారైతే ఇక నీ ఖర్మ.... వెళ్ళు.... వెళ్ళు ఇక ఈ కాలంలో మరెప్పుడూ గుర్రంగా పుట్టకు....ఏ మిషనుగానో పుట్టు. గౌరవం వుంటుంది....అసలు మనమే ఈ కాలానికి సరిపోలేమేమో. అడుగో! నా పెద్దకొడుకు! చూడు! ఆ రిక్షాని చూస్తూ ఎంతగా సంబర పడిపోతున్నాడో! అవును. మరి కాలం మారింది.... ఈ కాలానికి అదే తగిందేమో! వెళ్ళు.... వెళ్ళు!" వెంకటాద్రి మూగభాష ముత్యాలుకు అరమయింది! తల విదిల్చింది. బండి కదలిపోయింది. శేషమ్మ సైకిల్ రిక్షాకు ఎర్రనీళ్ళు తిప్పిపోస్తోంది సంబరంగా.

"రిక్షావాళ్ళకూడా పస్తులుంటారని తెలిసిన రోజు, ఈ ఎర్రనీళ్ళు మరెవరికి తిప్పుతావే శేషూ?" అనుకున్నాడు వెంకటాద్రి. అతగాడికి అలవిగాని బాధతోబాటు ఆపుకోలేని నవ్వూ ముంచుకొచ్చింది! *

("జ్యోతి" జనవరి '72)